రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# జయహో భారత్

భరతమాత వేషంలో మేడ్చల్ విద్యార్థిని





రంగారెడ్డి కలెక్టరేట్‌లో విద్యార్థుల విన్యాసం

రంగారెడ్డి కలెక్టరేట్‌లో విద్యార్థుల జానపద నృత్య ప్రదర్శన







గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న మేడ్చల్ విద్యార్థులు

**రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సోమవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో దేశభక్తి ఉప్పొంగింది. ఆయా జిల్లాల కలెక్టర్లతోపాటు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ పతాకావిష్కరణ చేశారు. జిల్లా కేంద్రాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా అభివృద్ధి, ప్రజాసేవలో విశేష కృషి చేసిన వివిధ శాఖల అధికారులకు కలెక్టర్లు అంజేశారు. వికారాబాద్ జిల్లాలో రోడ్డు వారోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాలపై నిర్వహించిన అవగాహన, అదేవిధంగా నేరస్థులు పసిగట్టే డాగ్ స్క్వాడ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.**



వికారాబాద్‌లో డాగ్ స్క్వాడ్ ప్రదర్శన





గౌరవ వందనం స్వీకరిస్తున్న వికారాబాద్ కలెక్టర్. ఫొటోలో ఎస్పి స్నేహ మెహ్రా

**జిల్లాలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ**

**పేదలకు 12,863 గృహాలు మంజూరు**

**గృహ జ్యోతి కింద 1,42,932 కుటుంబాలకు 70.44 కోట్ల సబ్సిడీ**

**సిసిఐ ద్వారా 47,447 మంది రైతుల నుండి పత్తి కొనుగోళ్లు**

**రూ.18.80 కోట్లతో 924 పాఠశాలల అభివృద్ధి**

**12780 మహిళా సంఘాలకు రూ.43.77 కోట్లు వడ్డీ లేని రుణాలు**

**అనంతగిరి, కోట్‌పల్లి, గొట్లపల్లి, అంతారం, బొంరాస్‌పేట్, జాఫర్‌పల్లిలలో రూ.10 కోట్లతో అర్బన్ పార్కులు**

**గణతంత్ర వేడుకల్లో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**

### అందరి సహకారం ఉంటే

## ఆగదు ఈ ప్రగతి రథం..

**వికారాబాద్, జనవరి 26, ప్రభాతవార్త :** అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి పరుస్తామని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ హామీ ఇచ్చారు. 77వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ జాతీయ జెండా ను ఎగురవేశారు. ముందుగా కలెక్టర్‌తోపాటు, ఎస్పీ స్నేహ మెహ్రా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా పాలన, పారదర్శకతతో సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఆడపడుచులు ట్రాన్స్ జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, ఇప్పటివరకు జిల్లాలో 5 కోట్ల 15 లక్షల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారని వివరించారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల రూపాయల రుణమాఫీ చేసిందని ఆయన పేర్కొన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు 2,65,269 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 12,863 గృహాలు నిర్మించుకోవడానికి ఆమోదించినట్లు ఆయన తెలిపారు. గృహ జ్యోతి కింద 1,42,932 కుటుంబాలకు 70 కోట్ల 44 లక్షల సబ్సిడీని ప్రభుత్వ అందజేసిందని అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నాటికి 16 కోట్ల 25 లక్షలు మార్కెట్ ఫీజు లక్ష్యంగా నిర్ణయించగా 826.56 లక్షలు మార్కెట్ ఫీజు ను సాధించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. సిసిఐ పత్తి కొ నుగోలు కేంద్రాల ద్వారా 47,447 మంది రైతుల నుండి పత్తిని కొ నుగోలు చేసి కనీసం మద్దతు ధర అందించినట్లు ఆయన అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో భాగంగా జిల్లాలో 1062 పాఠశాలలకు గా ను 924 పాఠశాలలో రూ.18.80 కోట్లతో ప నులు పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 12780 సంఘాలకు రూ.43.77 కోట్లు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. రూ.10 కోట్లతో అనంతగిరి, కోట్‌పల్లి, గొట్లపల్లి, అంతారం, బొంరాస్‌పెట్, జాఫర్‌పల్లి లలో అర్బన్ పార్కులు మంజూరు చేయడం జరిగిందని, వీటిలో అనంతగిరి అర్బన్ పార్క్‌ల 80 శాతం పనులు పూర్తి అయ్యాయని కలెక్టర్ వివరించారు. జిల్లాలో అమలవుతున్న పలు పథకాలు, అభివృద్ధి పనులను శాఖల వారిగా కలెక్టర్ వివరించారు. పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డు వారోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాలపై నిర్వహించిన అవగాహన, అదేవిధంగా నేరస్థులు పసిగట్టే డాగ్ స్క్వాడ్ ప్రదర్శన ఎంతగానో ఆకర్షించబడ్డాయి. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు, ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో చేవెళ్ల ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, బి.మనోహర్ రెడ్డి, అదనపు కలెక్టర్ లు రాజేశ్వరి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనలో రంగారెడ్డి ఫస్ట్

**రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉన్నాం**

**మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలి**

**కలెక్టర్ నారాయణ రెడ్డి**

**రంగారెడ్డిఅర్బన్, జనవరి 26, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగం అందించిన సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సోదరభావం విలువలను కాపాడుకుంటూ మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాల్సి న అవసరం ఉందని కలెక్టర్ నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ప్రత్యేక ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్, రేడియల్ రోడ్లు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు జిల్లా రూపురేఖలను మారుస్తాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి, రూ.500కే గ్యాస్, గృహ జ్యోతి, రైతు భరోసా, రైతు బీమా, పంట రుణమాఫీ వంటి పథకాల ద్వారా పేదలు, రైతులు, మహిళలకు ప్రభుత్వం బలమైన మద్దతు ఇస్తోందని వెల్లడించారు. విద్య, వైద్యం, పరిశ్రమలు, మహిళా సాధికారత, ఉపాధి హామీ పథకం అమలులో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తోందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా అభివృద్ధి, ప్రజాసేవలో విశేష కృషి చేసిన వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ నారాయణ రెడ్డి ఉత్తమ సేవ పురస్కారాలను అందించి ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, పోలీస్ యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**మండుటెండలో విద్యార్థులు మలమల**

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సంస్కృత కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు కనీస మోలిక సదుపాయాలు కూడా కల్పించకపోవడంపై తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మండుటెండలో గంటల తరబడి విద్యార్థులను ఎండలో కూర్చోబెట్టటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు మండిపడ్డారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే చిన్నారులు, విద్యార్థులకు కనీసం నీడ ఏర్పాట్లు, తాగునీరు, కూర్చోవడానికి సౌకర్యాలు కల్పించాల్సి న బాధ్యత అధికారులదే అయినా, ఈ విషయంలో పూర్తిగా విఫలమయ్యారని తల్లిదండ్రులు ఆరోపించారు. జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహిస్తూ, విద్యార్థుల భద్రత, ఆరోగ్యం పట్ల కనీస శ్రద్ధ కూడా చూపకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాల్సి న కార్యక్రమాలు ఇలా ఇబ్బందుల మధ్య జరగడం బాధాకరమని.. అధికారుల ప్రణాళికల లేమి వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు నిరసన వ్యక్తంచేశారు. అయినా ఎందుకు నిరక్ష్యం వహించారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా భవిష్యత్తులో అయినా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



డిఆర్‌డిఎ పిడి శ్రీలతకు ఉత్తమ పురస్కారం అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి




శామీర్‌పేట సిఐ శ్రీనాథ్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

## శభాష్..పోలీస్

**శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు రాష్ట్రంలో ప్రథమ స్థానం**

**జాతీయ స్థాయిలో ఏడవ స్థానం**

**శామీర్‌పేట, జనవరి 26, ప్రభాతవార్త :** గణతంత్ర దినోత్సవం సందర్భంగ శామీర్‌పేట పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ జిల్లా స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికై మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో శామీర్‌పేట సిఐ శ్రీనాథ్ జిల్లా స్థాయి ఉత్తమ అవార్డును ప్రోత్సాహక ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. దీనిలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిసిపి తదితరులు పాల్గొన్నారు. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇటీవలనే జాతీయ స్థాయిలో ఏడవ స్థానం, తెలంగాణలో ప్రథమ స్థానంలో ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శామీర్‌పేట సిఐ శ్రీనాథ్‌కు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ అవార్డును అందుకోవటం పట్ల పలువురు ఆయనను అభినందించారు.

### జాతినేతలకు నివాళి

**ఘట్‌కేసర్, జనవరి 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో జాతిపిత మహాత్మా గాంధీ, అంబేద్కర్‌ల చిత్ర పటాలకు పలువురు నివాళులు అర్పించి జెండావిష్కరణ గావించారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డితో పాటు ఘట్‌కేసర్, పోచారం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు ముల్లి పావని జంగయ్యయాదవ్, బోయపల్లి కొండల్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు బండారి శ్రీనివాస్‌గౌడ్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న డిసి వాణి

### సమన్వయమే..

## మా సక్సెస్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 26, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లాను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేలా కృషి జరుగుతోందని, రాష్ట్రంలోనే జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేస్తున్నామని కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించటానికి, సంక్షేమ పథకాల అమలులోను జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన విజన్-2047లో భాగస్వాములు అవుదామని కలెక్టర్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగ ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవవందనాన్ని స్వీకరించారు.

**రైతులకు రూ.23.49 కోట్ల పెట్టుబడి సహాయం**

అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని 24వేల 973మంది రైతులకు రూ.23కోట్ల49లక్షల పంటల పెట్టుబడి సహాయం అందిచామన్నారు. ఈ సంవత్సరం ఉద్యాన పంటల సాగు జిల్లాలో 7వేల767ఎకరాల్లో జరుగుతోందన్నారు. కూరగాయ పంటల సాగుకు శాశ్వత పందిర్ల నిర్మాణాలకు సబ్సిడీలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 21వ పశు గణన పూర్తి చేసినట్లు తెలిపారు. వ్యాధుల నియంత్రణకు సకాలంలో టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 94చెరువుల్లో వంద శాతం రాయితీపై 32లక్షల చెపపిల్లలను విడుదల చేశామని, సహకార శాఖ సంఘాల ద్వారా రైతులకు క్రిమిసంహారక మందులు, ఎరువులు విక్రయించటం, ధాన్యం సేకరణ జరిగిందని చెప్పారు. ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

**జిల్లాను అన్ని రంగాల్లో మరింత ముందుకు..**

**విజన్-2047లో భాగస్వాములు అవుతాం**

**కలెక్టర్ మనుచౌదరి**



మేడ్చల్ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరికి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డును అందిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

**1.95 లక్షల కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు**

ఈ సంవత్సరం లక్షా 9వేల461కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులను జారీ చేసినట్లు తెలిపారు. 3లక్షల48వేల353మంది లబ్ధిపొందుతున్నట్లు తెలిపారు. 2025 ఏప్రిల్ నుంచి ప్రతి నెల రేషన్‌షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీలన్నింటిని మున్సిపాల్టీల్లో విలీనం చేశామన్నారు.

**రెండవ అర్బన్‌నజిల్లాగా రూపాంతరం**

మేడ్చల్ జిల్లా రెండవ అర్బన్ జిల్లాగా రూపాంతరం చెందినట్లు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వార ప్రతి నెల ఫింఛన్లు 34కోట్ల20లక్షల రూపాయలు పంపిణీ జరుగుతుందన్నారు. లక్షా119స్వయం సహాయక సంఘాలకు 80కోట్ల95లక్షల రూపాయల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో పేదలకు ఇందిరమ్మ లక్షా 108 ఇళ్లు మంజూరు చేయగా.. పనులు చేపట్టినట్లు తెలిపారు.

ఈ సంవత్సరం 87మంది ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు 18కోట్ల 28లక్షల రూపాయలు ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం 370కోట్ల రూపాయల ఉపకారవేతనాలను ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పదవతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి శాఖల ద్వారా రోడ్లు, భవనాలు, డ్రైనేజీలు నిర్మాణాలు పలు అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రజలకు వైద్యశాఖ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

**అల్వాల్‌లో 1200 పడకల హాస్పిటల్**

అల్వాల్‌లో 1200పడకల హాస్పిటల్ (టిమ్స్) భవన నిర్మాణ పనులు తుది దశకు చేరినట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో శాంతిభద్రత రక్షణకు సైబరాబాద్, మల్కాజ్‌గిరి పోలీసు కమిషనరేట్ల పరిధిలోకి తీసుకు వచ్చామన్నారు.

**పర్యాటక పుణ్యక్షేత్రంగా కీసరగుట్ట ఆలయం**

జిల్లాలోని కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని పర్యాటక పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేలా కృషి జరుగుతుందని, ఈ సారి బ్రహ్మోత్స వాలను ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు కలెక్టర్ వివరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులకు, ఉద్యోగులకు ఉత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డుల కింద వారికి ప్రశంసపత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి జోన్ డిసిపి సిహెచ్ శ్రీధర్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పలువురు జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు జాతి రత్నాలుగా ఎదగాలి

**తల్లిదండ్రులకు హెల్మెట్ బహుమతిగా ఇవ్వండి**

**సినీ నటుడు బిత్తిరి సత్తి**

**చేవెళ్ల జనవరి 26, ప్రభాతవార్త :** విద్యార్థులు రేపటి జాతి రత్నాలు ఎదగాలని సినీ, మిమిక్రీ ఆర్టిస్ట్, కమెడియన్ బిత్తిరి సత్తి అలియాస్ పామెన కావలి రవికుమార్ సూచించారు. సోమవారం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని శ్రీ సత్య సాయి గ్రామర్ హైస్కూల్‌లో వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సిఐ ఉపేందర్ జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిత్తిరి సత్తి హాజరయ్యారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పార్కును సీఐ ఉపేందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బిత్తిరి సత్తి మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే రేపటి బావి భారత పౌరులని అన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు హెల్మెట్‌ను బహుమతిగా ఇవ్వాలన్నారు. మద్యం సేవించి, అపరిమిత వేగంతో వాహనాలు నడపరాదని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల ఆవరణలో ట్రాఫిక్ పార్క్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన, నియమ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ తదితర అంశాలను పాఠ్యాంశంలో భాగంగా విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. అనంతరం 100 మీటర్ల జాతీయ పతాకంతో చేవెళ్ల పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డ్ నుంచి శంకర్‌పల్లి చౌరస్తా వరకు నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. అక్కడే విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో సీఐ ఉపేందర్, ఎస్‌ఐలు తేజశ్రీ, వనం శిరీష, పాఠశాల డైరెక్టర్లు నల్లనాయుడు స్వరూప్ రెడ్డి, శ్రీనివాస్, వినోద్ సేటు, సంతోష్, బి.గోపాల్(సీనియర్ జర్నలిస్ట్), ప్రిన్సిపల్స్ అరుణ్ మణి, స్నేహలత పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో ఏర్పాటుచేసిన ట్రాఫిక్ పార్క్‌ను పరిశీలిస్తున్న బిత్తిరి సత్తి

# అలరించిన గిరిజన సాంప్రదాయం



**జిల్లెడు చౌదరిగూడ,జనవరి 26,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చింతకుంటతాండాలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో గిరిజన సంప్రదాయం ఎంతగానో అలరించింది. గిరిజన వేషధారణలతో సర్పంచ్ దేవి రామ్ చరణ్ జాతీయ జెండావిష్కరణ చేశారు. ఆమెతో పాటు తాండా వాసులు గిరిజన దుస్తులు దరించి జెండా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజన సాంప్రదాయంలో జెండావిష్కరణలో పాల్గొన్న గిరిజనులు

# పాఠశాల చుట్టూ కంచె ఏర్పాటు


కంచెను ఏర్పాటు చేసిన దృశ్యం

**చేవెళ్ల, జనవరి 26, ప్రభాతవార్త :** చేవెళ్ల మండలంలోని మడికట్టు గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల స్కూల్ గ్రౌండ్ చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ ఉపసర్పంచ్ జయలత బాల్ రెడ్డి గ్రామాభివృద్ధి పట్ల తమ బాధ్యతను మరోసారి నిరూపించారు. గ్రామ ప్రాథమిక పాఠశాల గ్రౌండ్ చుట్టూ తమ సొంత నిధులతో కడిలు ఏర్పాటు చేసి, తారు చుట్టింపించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన భద్రత కల్పించారు. ఇంతకు ముందు పాఠశాల గ్రౌండ్ చుట్టూ సరైన సదుపాయాలు లేకపోవడంతో చిన్నారులు ఆటల సమయంలో బయటకు వెళ్లే అవకాశం ఉండేది. అలాగే వర్షాకాలంలో మట్టి, బురద కారణంగా పాఠశాల పరిసరాలు అశుభ్రంగా మారేవి. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మాజీ ఉపసర్పంచ్ జయలత బాల్ రెడ్డి స్వయంగా ముందుకు వచ్చి పనులు చేపట్టించారు. ఈ పనుల వల్ల పాఠశాల గ్రౌండ్ స్పష్టమైన సరిహద్దులతో భద్రంగా మారడమే కాకుండా, పాఠశాల వాతావరణం మరింత శుభ్రంగా, క్రమబద్ధంగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేస్తూ మాజీ ఉపసర్పంచ్ జయలత బాల్ రెడ్డి సేవాభావాన్ని కొనియాడుతున్నారు. ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా స్వయంగా ఖర్చు చేసి చేసిన ఈ అభివృద్ధి పనులు గ్రామంలో మంచి ఆదర్శంగా నిలిచాయని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.


పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## విద్యార్థులకు క్రికెట్ కిట్‌ల పంపిణీ

**పెద్దేముల్, జనవరి 26, ప్రభాతవార్త:** సమాజసేవకు యూనిటి ఛారిట్రబుల్ ట్రస్ట్ యాజమాన్యం పాటుపడటం అభినందనీయమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనో హర్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్ బ్లూ స్కై ఫాంహౌస్‌లో యూనిటి చారిట్రబుల్ ట్రస్ట్ యాజమాన్యం సయ్యద్ మన్నన్‌సెట్, సయ్యద్ సాబెర్ అధ్వర్యంలో సోమవారం కొండాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రికెట్, వాలిబాల్ కిట్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తాను సంపాదించిన వాటిలో కొంత సమాజసేవకు ఉపయోగించడం కన్న ఆనందం మరొకటిలేదని అన్నారు. సయ్యద్ మన్నన్‌సెట్, సయ్యద్ సాబెర్‌లు విద్యార్థులకు ఆట వస్తువులను అందించి తమ ఉదారతను చాటుకున్నారని అన్నారు. మునుముందు వారు మరిన్నిఉన్నత స్థానాలకు ఎదిగి సమాజసేవకు మరింత పాటుపడాలని అన్నారు. బ్లూ స్కై యాజమాన్యంను ఆదర్శంగా తీసుకొని మరికొందరు సమాజసేవలోభాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, కోటపల్లి మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ ఎస్. నారాయణ్‌రెడ్డి, యువనాయకులు రుద్రారం మహి పాల్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, మైపూస్, విజయభాస్కర్‌రెడ్డి, రెగొండి, కొండాపూర్ సర్పం చ్‌లు అశోక్, బిబి అనిష్ ఇసాక్, మంబాపూర్ మాజీసర్పంచ్ ఆర్.శ్రీనివాస్, పీటర్ యా దయ్య, కుర్వ శ్రీనివాస్, నాయకులు మానెయ్య, బందెప్ప, సీనియర్ వాలిబాల్ ప్లేయర్ జియాఉద్దిన్‌తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కొండంత భరోసా



**తాండూరు, జనవరి 26, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కొండంత భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంతన్న సర్కారు మహిళలకు పెద్ద పీట వేస్తుందని తెలిపారు. పట్టణంలో ఉన్న మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ ద్వారా ఇప్పటికే సుమారు రూ. 25కోట్లు అందించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వంలో మహిళలను పారిశ్రామిక వేత్తలను చేయడమే లక్ష్యమని అన్నారు. మున్సిపల్ అభివృద్ధిలో ఆర్‌పీల పాత్ర కీలకమన్నారు. గతంలో మాదిరిగా కాకుండా మహిళలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేయడం జరిగిందని, ఉగాది పండగ వరకు అందరికి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. తప్పుడు ప్రచారాలను ఎవరు నమ్మవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కపల్లి పాఠశాలకు అండగా నవ సమాజ్ సేవా సమితి

**మాడ్గుల, జనవరి26, ప్రభాతవార్త:** ఆర్కపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు, నవ సమాజ్ సేవా సమితి సభ్యులు పదివేల రూపాయల విలువైన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నవ సమాజ్ సేవా సమితి సభ్యులు షేక్ షబ్బీర్ హుస్సేన్, కే. జంగారెడ్డి, బి. యాదయ్య, ఎం. శ్రీనివాస్ చారి, కే. సుదర్శన్ రెడ్డి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలను గ్రామ సర్పంచ్ కల్లు భాగ్యలక్ష్మితిరుపతి రెడ్డిసమకూర్చారు. వార్డు సభ్యురాలుసీత రాధమ్మప్రశాంత్‌లు విద్యార్థులకు టై, బెల్ట్, గుర్తింపు కార్డులను అందజేశారు. వార్డు సభ్యురాలు ప్రేమలత బిక్కయ్య పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తానని ప్రకటించగా, తుమ్మటి ఉపేందర్‌రెడ్డి త్రాగునీటి వడపోత యంత్రాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నవ సమాజ సభ్యులు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలలో అభివృద్ధికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు రానున్న రోజుల్లో మరికొన్ని సదుపాయాలని సమకూరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



### ప్లాట్ల రక్షణ కొరకు సహకరించండి

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 26, ప్రభాత వార్త:** ప్లాట్ల రక్షణ కొరకు బాధితులంతా ఐక్యతతో ఉండి కలిసికట్టుగా ఉద్యమించాలని శ్రీనివాస్ నగర్ కాలనీ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొట్టు రాజేశ్ అన్నారు. పోచారం డివిజన్ యంనంపేట్ శ్రీనివాస్ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు సోమవారం తమ ప్లాట్ల వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులంతా ఐక్యతతో ఉండి తమ ప్లాట్ల రక్షణ కొరకు చట్టపరంగా పోరాటం చేసేందుకు అసోసియేషన్‌కు సహకరించాలని అన్నారు. సర్వేనెంబరు 117, 120 లలోని ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు అందరూ విధిగా అసోసియేషన్ పిలుపుకు స్పందించాలని కోరారు. ఐక్యతతో ఉండి ఉద్యమిస్తేనే న్యాయం జరుగుతుందని అన్నారు. కొందరు వ్యక్తులు నకిలీ డ్యాకుమెంట్లు సృష్టించి ప్లాట్లను అక్రమించాలని చూస్తున్నారని వారిని న్యాయపరంగా, చట్టపరంగా ఎదుర్కొవడానికి ఐక్యతతో ఉద్యమిద్దామని అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు గణ తంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని ఏగురవేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన సభ్యులు వీరభద్రయ్య, ఎస్‌పి. రాయుడు, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


బొట్టు రాజేశ్

### హెపటైటిస్-బి వ్యాక్సిన్ తీసుకున్న వైద్య సిబ్బంది

**దౌల్తాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం సోమవారంరోజు పిహెచ్‌సీ సిబ్బందికి హెపటైటిస్ వైరస్ (కాలేయ సంబంధిత వ్యాధి) సోకకుండా ముందుజాగ్రత్తతో భాగంగా వైద్య సిబ్బంది అందరికీ హెపటైటిస్-బి వ్యాక్సిన్ ఇవ్వడం జరిగిందని దౌల్తాబాద్ పిహెచ్‌సీ వైద్యాధికారిణి అమూల్య ప్రియదర్శిని తెలిపారు. ఈ కార్యక్రమం సూపర్వైజర్ రఫీ, పిహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్యాలయం ప్రారంభం

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 26, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలో విద్యుత్ ఏఈ తాత్కాలిక కార్యాలయాన్ని సోమవారం ప్రారంబించారు. జిల్లెడు చౌదరిగూడ మండలంని జిల్లెడు గ్రామంలో విద్యుత్ ఏఈ తాత్కాలిక కార్యాలయాన్ని డీఈ శ్యాంసుందర్, ఏడీ సత్యనారాయణలు ప్రారంభించారు. మండలం ఏర్పాటైన తర్వాత మొదటి సారి ఏఈ నర్సింలు చార్జి తీసుకోవడం పట్ల మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు ఏ ఈ నర్సింలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశంపేట ఏఈ ఈశ్వర్, షాద్ నగర్ రురల్ షణ్ముక్ రెడ్డి, టౌన్ ఎఈ, సాయి కృష్ణ, కొందుర్గు రవి కుమార్, హెచ్ 81 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కావాలి వెంకటేష్, హెచ్ 82 యూనియన్ ప్రభాకర్ చారి, 327 యూనియన్ ప్రభాకర్ రెడ్డి, 1104 యునియన్ చిన్నా రెడ్డి , ఎచ్ 82యునియన్ షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి ప్రవీణ్ పటేల్, కాంట్రాక్టర్ మధుసూదన్ రెడ్డితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.


నూతన కార్యాలయాన్ని ప్రారంబిస్తున్న అధికారులు



అన్నోజిగూడ సత్యసాయి కాలనీలో

## కమ్యూనిటీ హాలు ప్రారంభం

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 26, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ 8 అన్నోజిగూడ సత్యసాయి హౌసింగ్ కాలనీలో మాజీ సింగిల్ విండో డైరక్టర్ బోయపల్లి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ హాలును సోమవారం రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. స్థలదాతలు స్వర్గీయ బోయపల్లి నర్సమ్మసత్తిరెడ్డిల జ్ఞాపకార్థం నిర్మించిన కమ్యూనిటీ హాలును కాలనీవాసుల సమక్షంలో ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాజీ సింగిల్ విండో డైరక్టర్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కొరకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, స్థానిక నాయకులు బి. రాజేశ్వర్‌రెడ్డి, రఘురాం రెడ్డి, కేఎం. రెడ్డి, జితేందర్ నాయక్, అల్వాల సంతోశ్ గౌడ్, లోకేశ్, రఘు, కృష్ణ గౌడ్, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## శివనామస్మరణతో మారుమ్రోగిన శ్రీమహదేవుని ఆలయం

**కొడంగల్, జనవరి 26ప్రభాతవార్త:** కొడంగల్ పట్టణంలోని శ్రీమహదేవుని ఆలయంలో శివస్వాములు ఘనంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించడంతో ఆలయ పరిసర ప్రాంతం శివనామస్మరణతో మారుమ్రోగింది. సోమవారం శివస్వాములుగా అర్ధమండల దీక్షను స్వీకరించారు. ఆలయంలో శివదీక్షా మాలాధారాలు శివలింగానికి శివాలయంలో గురుస్వాములు గడ్డం చంద్రశేఖర్ స్వామి అద్వర్యంలో గణపతి పూజ, సంకల్పం, రుద్రాభిషేకం, శివార్చన, శివాష్టకం, బిల్వార్చన, లింగాష్టకం, పంచాక్షరీ స్తోత్రంశివ అష్టోత్తర శతనామావళి భక్తి పారవశ్యంతో పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామున నిజలింగప్ప దేశ్‌ముఖ్ రావులపల్లి మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డిదేశ్‌ముఖ్ కుటుంబసభ్యులులింగానికి రుద్రాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ంగురంగు పూలతోవిశేష అలంకరణ శివస్వాములు శరణుగోషలు, ఖడ్గాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివస్వాములు భజనలు చేస్తు శివనామ స్మరణతో మారుమ్రోగింది. అనంతరం దివంగత పార్వతమ్మ దేశ్మఉఖ్ జ్ఞాపకార్దం వారి కుటుంబ సభ్యులు శివస్వాములకు బిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## జాతీయ జెండాకు సెల్యూట్ మరిచిన కార్యదర్శి


జాతీయ జెండాకు సెల్యుట్ చేయకుండ నిలబడ్డ పంచాయితీ కార్యదర్శి ఆనంద్

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 26, (ప్రభాతవార్త):** గణతంత్ర వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని చౌదరిగుడ గ్రామపంచాయతీ కార్యాలయం పై సర్పంచి శ్వేత చంద్రబాబు గౌడ్ జెండాను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రజలందరూ జెండాకు సెల్యూట్ చేస్తే అక్కడే ఉన్న పంచాయతీ కార్యదర్శి ఆనంద్ మాత్రం జెండాకు సెల్యూట్ చేయకుండా నిలబడ్డారు. ఇది చూసిన వారందరూ కార్యదర్శి జెండాకి ఎందుకు సెల్యూట్ చేయలేదంటూ ప్రశ్నిస్తున్నారు.

## అచ్చయ్య కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సాయం

**మాడ్గుల, జనవరి 26, ప్రభాత వార్త:** మండలంలోని కొల్కులపల్లి గ్రామానికి చెందిన పడాల అచ్చయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బట్టు అనురాధ కిషన్ రెడ్డిలు అచ్చయ్య మృత్యదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి మూడు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కష్టసమయంలో తమ కుటుంబం అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలే యాదయ్య, దుర్గాప్రసాద్, నాగిల్ల మహేష్, పడాల శ్రీశైలం పాల్గొన్నారు.

## పర్సాపూర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సర్పంచ్ రాధశ్రీనివాస్‌రెడ్డి



**కొడంగల్, జనవరి 26ప్రభాతవార్త** పర్సాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తు మండలంలోనే పర్సాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సర్పంచ్ రాధశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియో జకవర్గ ఇంచార్జ్ తిరుపతి రెడ్డిల సహకారంతో గ్రామం లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గ్రామంలో తాగునీరు, రోడ్లు మురుగుకాల్వల నిర్మాణం, కందకం పూడ్చివేత, అంగన్‌వాడీ భవన నిర్మాణంతో పాటు యువతకు అవసరమైయ్యే గ్రంధాలయ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో పాటు గ్రామస్దులు బానకారి రాములు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీశైలం, సూరి, జీడి మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

**కొడంగల్, జనవరి 26, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉడిమేశ్వరం గ్రామంలో ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్సై జీవీత. సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం అప్పాయిపల్లి గ్రామానికి చెందిన చిన్న దస్తప్ప ఉడిమేశ్వరంలోని పాటిమీదిపల్లి చంద్రమ్మఇకి ఇల్లరికం వచ్చాడు. గ్రామంలోనే ఉంటూ గ్రామంలోని అంజిలప్పకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం అంజిలప్ప పొలంలో వరి కరిగేట పనులు చేస్తుండగా ట్రాక్టర్ బోల్తాపడింది. తో చిన్న దస్తప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శ్యామల, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతుడు చిన్న దస్తప్ప సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చేవెళ్ల మున్సిపల్‌లో గులాబి జెండా ఎగురవేయాలి



**చేవెళ్ల, జనవరి 26, ప్రభాతవార్త:** రానున్న చేవెళ్ల మున్సిపల్ ఎన్నికల్లో గులాబి జెండా ఎగుర వేయాలని, బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపె లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. సోమవారం నగరంలోని తెలంగాణభవన్‌లో మాజీ మంత్రి, మహేశ్వరం ఏమ్మేల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డిసమక్ష్యంలో చేవెళ్ల మాజీ ఎంపిపి మల్గారి విజయభాస్కర్‌రెడ్డి, పెంజర్ల ఆనంతరెడ్డి, కనకమామిడి మల్లారెడ్డి, మంగళి రాజులతో పాటు సుమారు 200 మంది వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. చేవెళ్ల మాజీ ఎంపిపి మల్గారి విజయభాస్కర్‌రెడ్డి, పెంజర్ల ఆనంతరెడ్డి , కనకమామిడి మల్లారెడ్డి, మంగళి రాజులకు గులాబికండువాలను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు కప్పి పార్టీలోకి స్వయంగా అహ్వానించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి పాలన గాడి తప్పిందని, రైతు బంధులేదు, బతుకమ్మ చీరలులేవు, రంజాన్ కానుకలులేవు, కెసిఆర్ కిట్‌లు అందించలేని స్థితిలో ఉన్నారు. సిఎం హోదాలో ఉండి బూతులు మాట్లాడటం ఎంతవరకు సమంజసమని, మాటలు జాగ్రత్తగా మాట్లాడాలన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం పూర్తిగా విఫలమైందన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరికి ఫించన్‌లను అందిస్తామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి మాత్రమే కన్పిస్తుందన్నారు.



### ఇందిరమ్మ రాజ్యంలోనే నిరుపేదల సొంతింటి కల సాకారం

చౌలపల్లి సర్పంచ్ వజ్రమ్మ

**కేశంపేట, జనవరి 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉన్న నిరుపేద ప్రజల సొంతింటి కల ఇందిరమ్మ రాజ్యంలోనే సాధ్యమవుతుందని చౌలపల్లి గ్రామ సర్పంచ్ వజ్రమ్మ అన్నారు. కేశంపేట మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరేశం తో కలిసి ఆమె పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు వీరేశం మాట్లాడుతూ గతంలో రాష్ట్రాన్ని పరిపాలించిన పాలకులు, ప్రజా ప్రతినిధులు నిరుపేదలను పట్టించుకున్న పాపాన పోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో గ్రామాలు కలకలలాడుతున్నాయని, నిరుపేదలు సొంతింట్లో ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఇకపై ఎవరికి కూడా ఇల్లు లేదని అధైర్యపడవద్దని ఇల్లు లేని ప్రతి ఒక్కరికి విడతలవారీగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు కర్నాటి శివమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు యువకులు, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు కాలనీలో విఠలయ్య గౌడ్ గృహంలో పరామర్శ

**షాద్‌నగర్, జనవరి 26, ప్రభాతవార్త :** నందిగామ మండలం వీర్లపల్లి గ్రామానికి చెందిన కొమ్మగంటి విఠలయ్య గౌడ్ ను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విఠలయ్య గౌడ్ ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వగ్రామ పెద్దలతో కలిసి వచ్చారు. విఠలయ్య గౌడ్ కుమారులు శ్రీహరి గౌడ్, జగన్ గౌడ్, ప్రతాప్ గౌడ్ లతో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడారు. తండ్రి ఆరోగ్యం గురించి వారి నుండి అడిగి తెలుసుకున్నారు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న విఠలయ్యకు చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. నిత్యం వ్యవసాయం చేస్తూ గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండేవారని అనారోగ్యంతో బాధపడుతున్నందుకు ఈ విషయం తెలుసుకొని ఇంటికి రావడం జరిగిందని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. కాసేపు విఠలయ్య కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే గడిపారు. ఈ కార్యక్రమంలో రైతు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జర్నలిస్టు కెపి, స్థానిక యువ నాయకుడు మురళీమోహన్ అప్పి, కమ్మ సమైక్యవేదిక నాయకుడు నాయకుడు మాకినేని వెంకటరమణ, పాల్గొన్నవారు పాలకొండ శేఖర్ గౌడ్, అన్వర్ పాష, మహబూబ్, మహమూద్, ప్రభాకర్ రెడ్డి, సందీప్, దాసు, రాఘవేందర్ గౌడ్, శ్రీను, కాలనీవాసి నందిగామ మల్లేష్, తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.



### ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు కొనసాగించాలి

కాంగ్రెస్ నాయకుల డిమాండ్

**చేవెళ్ల, జనవరి 26, ప్రభాతవార్త :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ చేవెళ్ల మండలం మూడిమ్యాల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద మాజీ పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ... గాంధీ పేరును తొలగించే ప్రయత్నం దురుద్దేశపూరితమని, నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌడిచర్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, గోనె జంగారెడ్డి, గోనె శ్రీనివాస్ రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### ఫ్యూచర్ సిటీపేరుతో భూములు లాక్కుంటే సహించేదిలేదు

-భూసేకరణ ఆపకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తాం

- బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం, జనవరి 01, ప్రభాతవార్త:** ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి పేరుతో నందివనపర్తి గ్రామానికి చెందిన ఓంకారేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన ఎండోమెంట్ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ చేసేందుకు పూనుకోవడం భవ్యంకాదని ఈ భూములను నమ్ముకున్న రైతులు జీవనోపాది కోల్పోయి బజారున పడతారని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మండిపడ్డారు. .సోమవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాచారం మండలం మొండిగౌరెల్లి, కొత్తపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. అదేవిదంగా ఓంకారేశ్వర స్వామి ఆలయానికి చెందిన ఎండోమెంట్ భూములు సుమారు పదకొండు వందల ఎకరాలు ప్రభుత్వం తీసుకోవడానికి నోటిఫికేషన్ జారీ చేసేందుకు పూనుకుందని దీని వెనుక భూదందానే కారణ మన్నారు. ల్యాండ్ పూలింగ్ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతోందని ఆరోపిస్తూ.. దీనిపై రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులకు మాత్రమే శిలాఫలకాలు వేస్తూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తన ఘనతగా చెప్పుకుంటున్నారని తాను సొంతంగా తెచ్చిన అభివృద్ధి నిధులు ఏవో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి ఆక్టోపస్ రోడ్డుకు రూ.60 కోట్లు, తుర్కయంజాల్ చెరువు కట్ట-తొర్రూరు రోడ్డుకు రూ.24 కోట్లు, ఇంజాపూర్-మునగనూరు రోడ్డుకు రూ.20 కోట్లు, యాచారం-మీర్‌ఖాన్‌పేట రోడ్డుకు రూ.104 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. అలాగే ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు సుందరీకరణకు రూ.18 కోట్లు మంజూరు కాగా, అందులో రూ.9.70 కోట్ల టెండర్ ప్రక్రియ నాడే పూర్తయిందన్నారు. ఇబ్రఇబ్రహీంపట్నం మండలం ఖానాపూర్ గ్రామం సర్వే నంబర్ 43లో (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా) స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన కూడా చేశామని అదేవిదంగా ఇబ్రహీంపట్నం వాటర్ పైప్‌లైన్ రోడ్డుకు రూ.3.50కోట్ల నిధులు మంజూరై పనులు ప్రారంభించామని దానిని ఎందకు నిలిపివేశారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని ఆయన అన్నారు.



# రేపటి నుంచి శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు


ఎదులాబాద్‌లోని రుక్మిణి, సత్యభామసమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం

**ఘట్‌కేసర్, జనవరి 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు అంబారీపేట అప్పలాచార్యులు, మురళీకృష్ణ, వరదరాజులు తెలిపారు. ఈయేడు స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయంలో అంబారిపేట అప్పలాచార్యులు, సహోదరులు, కుమారులు, వంశపారంపర్య ధర్మకర్తలు, అర్చకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు తొళక్కం, దివ్యప్రబంధ పారాయణం, ద్రావిడ వేదపారాయణం, 29న ఉదయం విష్వక్సే నారాధన, పుణ్యాహావాచనము, రక్షాబంధనము, ఋత్విక్కరణం, అంకురార్పణ, అఖండదీపారాధన, అవాహిత మంటపారాధన, అగ్నిప్రతిష్ఠ, వేదగీతాహవనం, విషాద, సంఖ్యాకర్మ, జ్ఞానయోగ అధ్యాయములు, నిత్యపూర్ణాహుతి, సేవాకాలము, ప్రోభోధకి ఆరగింపు, తీర్థప్రసాదగోష్టి, మంటప ప్రాకార సేవ, సాయంత్రం 5 గంటలకు దివ్యప్రబంధ పారాయణం, 30న పుణ్యహావచనము, గీతాహవనము, కర్మ, సన్యాస, ఆత్మసంయమన, విజ్ఞాన అధ్యాయముల హవనము, నిత్యపూర్ణాహుతి, మంటప ప్రాకారసేవ, వైకుంఠోత్సవం ( నమ్మాళ్వార్ పరమపదోత్సవం), 31న పుణ్యహావాచనము, అక్షర పరబ్రహ్మ, రాజవిద్య, రాజగుహ్య, విభూతియోగ అధ్యాయము హవనం, నిత్యపూర్ణాహుతి, సేవాకాలము, ప్రోభోధకి ఆరగింపు, స్వామివారి గ్రామసేవ, ఉదయం 11 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో రుక్మిణీ, సత్యభామ, శ్రీవేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం, కళ్యాణ మండపంలో సహస్ర దీపాలంకరణసేవ, ఫిబ్రవరి 1న పుణ్యహావాచనము, గీతాహవనము, విశ్వరూప సందర్శన, భక్తి, క్షేత్రజ్ఞ విభాగ గుణత్రయ, పురుషోత్తమ ప్రాప్తి, గీతాహవనము, దైవాసుర, అధ్యాయము శ్రద్ధాత్రయ, మోక్షసన్యాస మోగముల హవనము, మహాపూర్ణాహుతి హారతి, మంత్రపుష్పం, ఆశీర్వచనము, పండిత సన్మానం, సేవాకాలము, ప్రోభోధిక ఆరగింపు, సాయంత్రం 6 గంటలకు స్వామి విమాన రథోత్సవం, 2న చక్రతీర్థస్నానము, ఆరగింపు, తీర్థప్రసాదగోష్టి తదితర పూజా కార్యాక్రమాలు జరుగుతాయని భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని ధర్మకర్తలు కోరారు.

